ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహా, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | బుధవారం | 08.07.2026 | సంపుటి : 2 | సంచిక : 07 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



02

పార్టీ పేరుమార్పుపై
## న్యాయ పోరాటం
ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్



04

హర్మూజ్‌లో మరోసారి
## ఉద్రిక్తత
రెండు నౌకలపై ఇరాన్ మిస్సైల్ దాడి



04

అయోధ్య చోరీలో కీలక
## ఆధారాలు సేకరణ
కరెన్సీని జేబులు, బూట్లల్లో దాచుకుని తరలింపు

# కేసీఆర్‌ది ఆర్థిక ఉగ్రవాద కుటుంబం

### కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదాం



- కేసీఆర్ సరేనంటే.. ఎంత సమయమైనా కేటాయిస్తాం
- కేసీఆర్ వాదన సరైనదయితే.. ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం
- నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్, జూలై 7 : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్ట్‌ను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్ట్ ఇచ్చుకోవచ్చుంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు

-మిగతా 2 లో..

### రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్
## దిశగా అడుగులు

- ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం
- పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్
- సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేందుకు ఉపయుక్తం
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 7 : పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్

-మిగతా 2 లో..



# స్నేహితుల మధ్య 'కాపీరైట్' వర్తించదు

### రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేషియా బంధం

- పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని మోడీ
- మోడీ పథకాలు కాపీకొట్టామన్న అధ్యక్షుడు

రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు.

02

### సింగరేణికి తాడిచర్ల-2
# బొగ్గు గనులు

### 182 మి. టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం

- సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 7 : తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం

-మిగతా 2 లో..



# ధరణి పోర్టల్‌తో భూ అక్రమాలు

### సమగ్ర దర్యాప్తు దిశగా ప్రభుత్వం చర్యలు

- సిట్ వేసే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 7 : ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం విజిలెన్స్ విభాగం ద్వారా లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వెలుగులోకి వస్తున్న అక్రమాలపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం

-మిగతా 2 లో..

### అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో..
# 38 మందికి ఉరిశిక్ష




### 18 ఏళ్ల తర్వాత బాధితులకు న్యాయం

- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన గుజరాత్ హైకోర్టు
- 11 మందికి యావజ్జీవ శిక్ష యథాతథం
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

2008 జూలై 26న అహ్మదాబాద్ నగరంలో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబులు పేలాయి. రద్దీగా ఉండే మార్కెట్లు, నగర బస్సులు, ఆసుపత్రుల ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. పేలుళ్లలో 56 మంది మరణించగా, 200 మందికి పైగా గా యపడ్డారు. సైకిళ్లకు అమర్చిన టిఫిన్ బాక్సుల్లో పేలుడు పదార్థాలను ఉంచి దాడులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది.

04



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

### 8 ఎకరాల వరకు
# రైతుభరోసా జమ

### 7 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో 7750.45 కోట్లు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూలై 7 : రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద 7 వ విడతలో 7 నుండి 8 ఎకరాలకు వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ. 259.73 కోట్లను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 58,831 మంది రైతులు, 4.32 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించిన రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి

-మిగతా 2 లో..





# గురుకులాల్లో పరిశుభ్రతకు పెద్దపీట

- మెనూ ప్రకారం ఆహార సరఫరా
- అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూలై 7 : గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం ఆయా శాఖల ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

-మిగతా 2 లో..



### రూ.360 కోట్లతో రెవెన్యూ
## శాశ్వత భవనాలు

- ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం
- 10 ఆర్డీవో,107 తహశీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02



# స్నేహితుల మధ్య 'కాపీరైట్' వర్తించదు

న్యూఢిల్లీ, జూలై 7 : ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో అంతకుముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ.. స్నేహితుల మధ్య 'కాపీరైట్‌లు' ఉండవని నవ్వుతూ వ్యాఖ్యానించారు. జకార్తాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రబోవో మంగళవారం ఉదయం మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఎన్నో ఏళ్లుగా మోదీని నిశితంగా గమనిస్తున్నానని.. ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు, పథకాలను కాపీ కొట్టానని అన్నారు. రెండు దేశాల్లో జనాభా ఎక్కువ ఉండడం, ప్రకృతి విపత్తులు వంటి సమస్యల నేపథ్యంలో వాటిని అధిగమించడానికి భారత్ అనుసరించే పద్ధతులను తాము కూడా పాటిస్తామన్నారు. మోదీ చేపట్టే కార్యక్రమాలలో దేనిపైనా కాపీరైట్ లేకపోవడం సంతోషంగా ఉందంటూ చిరునవ్వులు చిందించారు. ప్రధాని మోదీ ఇండోనేసియాలో పర్యటిస్తున్న క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. ఆ దేశంలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు ప్రధాని మోదీ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

### ప్రధాని మోడీకి అరుదైన గౌరవం

భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా దేశం తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా'అవార్డును ప్రధాని మోదీకి ప్రకటించింది. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఇండోనేసియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఈ అత్యున్నత పురస్కారాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత్-ఇండోనేసియా దేశాల మధ్య చారిత్రక బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చడంలో ప్రధాని మోదీ పోషించిన పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) ప్రయోజనాల కోసం, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల కోసం భారత్ అందిస్తున్న సహకారం అమోఘమైనదని ఆయన ప్రశంసించారు.

# ధరణి పోర్టల్‌తో భూ అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

కలకలం రేపుతోంది. భద్రతా వ్యవస్థలను బైపాస్ చేస్తూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి లావాదేవీలు నిర్వహించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. అంతేకాకుండా విదేశాల్లో ఉన్న భూ యజమానులకు తెలియకుండానే వారి పేర్లలో మార్పులు చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించనున్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో జరిగిన సుమారు రూ.8లక్షల లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ పరిశీలనలో దాదాపు 22 వేల రిజిస్ట్రేషన్లలో తేడాలు ఉన్నట్లు సమాచారం. అలాగే 'ఘోస్ట్ ఐడీలు' ఉపయోగించి లక్షల ఎకరాల భూ రికార్డులను మార్చినట్లు ఆరోపణలు రావడం మరింత సంచలనంగా మారింది. కొందరు సిస్టమ్‌లోని టైమ్ క్లాక్‌ను మార్చి పాత తేదీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సంస్థ నిర్వహించిన పరిశీలనలో ఈ అంశాలు బయటపడినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవడం, భూ రికార్డుల భద్రతను మరింత బలోపేతం చేయడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వం చేపట్టబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# గురుకులాల్లో పరిశుభ్రతకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమంపై డీబీసీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర రాష్ట్రాల స్టడీ సర్కిల్స్ విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు సమాన అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. ఐటీ, ఐఐఎం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీపై ఈ సందర్భంగా అధికారుల నుంచి మంత్రి నివేదిక కోరారు. గురుకులాలు, హాస్టళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు. కుట్టు మిషన్ పథకం అమలుకు సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల కిట్ల పంపిణీ వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# 8 ఎకరాల వరకు రైతుభరోసా జమ

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విడతల వారీగా రైతుభరోసా నిధులను విడుదల చేస్తున్నామని, ఇప్పటికే 6 దశలలో 7 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, ఈ రోజు 7 నుండి 8 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు. ప్పటివరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 68.96 లక్షల మంది రైతులకు, 129.17 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించి రూ.7750.45 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# కేసీఆర్‌ది ఆర్థిక ఉగ్రవాద కుటుంబం

(మొదటిపేజీ తరువాయి)




కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతున్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరుపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్-పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అయి తే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్ధాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్ధాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు. అబద్ధాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని రేవంత్ చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్ హౌస్ మునిగి పోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని ముఖ్య మంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖాతాన్ని తెచ్చి నట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైం దని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు హాజరయ్యారు.

# రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాము లయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

## ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్



**న్యూఢిల్లీ, జూలై 7 :** పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు

## రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూలై 7 :** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం నాడు అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అదె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయిలతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అదె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

# ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య

**భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు**

**గుట్టురట్టు చేసిన మియాపూర్ పోలీసులు**

**మహారాష్ట్ర సరిహద్దులో శవాన్ని పూడ్చిపెట్టినట్లు గుర్తింపు**

**హైదరాబాద్, జూలై 7 :** ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య, ఏమీ తెలియదన్నట్లుగా మిస్సింగ్ కేసు పెట్టింది. భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నగరంలోని మియాపూర్‌లో ఈ దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య అత్యంత కిరాతంగా హత్య చేసింది. ఆ తరువాత భర్త కనిపించడం లేదంటూ గతేడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా అసలు నిజాలు బయటకు వచ్చాయి. ఏడు నెలల తర్వాత ఈ కేసులో భార్యే హంతకురాలిగా పోలీసులు తేల్చారు. భర్తను భార్యే హత్య చేసి ఆపై కనిపించడం లేదంటూ నాటకం ఆడినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా భార్య కాల్ రికార్డ్స్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. భర్తను చంపి మృతదేహాన్ని మహారాష్ట్ర బోర్డర్ వరకు తరలించి పూడ్చిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు వెంటేష్(45)గా గుర్తించారు. తన ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో వెంకటేష్‌ను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో భార్య అంగీకరించింది. ప్రస్తుతం నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె ప్రియుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రియుడి కోసం కట్టుకున్న భర్తను భార్య హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, పిల్లలదే కీలక పాత్ర

- మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని
- గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం
- నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభంలో సిఎం రేవంత్



**హైదరాబాద్, జూలై 7 :** తెలంగాణ సమాజ అభివృద్ధిలో మహిళలు, పిల్లల పాత్రే అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నాచారంలో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ స్కూళ్లలోనే టీచర్లు కూడా బ్రేక్‌ఫాస్ట్, లంచ్ చేయాలని సీఎం నిర్ణయించారు. ఇక్కడ తయారు చేసే బాలమృతం ఇతర రాష్ట్రాలకు కూడా సరఫషరా చేసే విధంగా ప్లాంట్ రూపొందిందని అన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్లపాటు బాలామృతం పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా ఈ ఎ÷-లాంట్ అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లలకు ఓట్లు లేకపోయినా.. వారి భవిష్యత్ పట్ల తమ ప్రభుత్వానికి శ్రద్ధ ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళల సంక్షేమంపై మాట్లాడుతూ.. ప్రజా పాలన వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, దీనివల్ల పనిచేసే మహిళలకు నెలకు 10 వేల వరకు ఆదా అవుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరు మీదే ఇస్తున్నామని.. త్వరలోనే హైదరాబాద్ సిటీలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు పంచుతామని సీఎం భరోసా ఇచ్చారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపోతే రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాచారంలో రూ.40 కోట్లతో నిర్మించిన బాలామృతం తయారీ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. తయారీ వివరాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ద్వారా గంటకు 18 టన్నుల బాలామృతం తయారు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. మరోవైపు త్వరలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తామని సీఎం చెప్పారు. 'ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 4.5లక్షల ఇళ్లు కట్టాం. పట్టణాల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. విద్యార్థుల కోసం ఏటా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాజకీయాలకతీతంగా ఉప్పల్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటా అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

## తాడిచర్లతో మరో 40 ఏళ్లపాటు ఢోకా లేదు

### కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్, జూలై 7 :** సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం కృషి ఫలించిందని అన్నారు. మరో 40 ఏళ్ల పాటు మైనింగ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. 340 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు అవకాశం కలిగిందని చెప్పారు. తాడిచర్ల-2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. బ్లాక్‌లో జీ-9 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు లభ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి భారీ ఊతం లభించినట్లు అయిందని అన్నారు. దీంతో రైలు, రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశ్రామిక రంగాలకు దీర్ఘకాలిక బొగ్గు భద్రత ఉంటుందని చెప్పారు. సింగరేణి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఇది బలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర బొగ్గు బ్లాకులు కూడా సింగరేణికే ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

## కడియంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందే

- నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు
- మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమటి
- సిఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూలై 7 :** స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను , నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయాన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

## డిఎస్పీ భీమ్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

**హైదరాబాద్,జూలై7 :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన డీఎస్పీ భీమ్‌రెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. భారీ ఎత్తున అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ తనిఖీల్లో ఏకంగా రూ. 300 కోట్లకు పైగా విలువైన అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, కోర్టు ముందు హాజరుపరిచారు. కేసు తీవ్రతను పరిశీలించిన న్యాయస్థానం భీమ్‌రెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల అనంతరం పోలీసులు ఆయన్ను గట్టి భద్రత నడుమ చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## మనవడికి గాయం.. ఏఐజీ ఆస్పత్రికి కేసీఆర్

**హైదరాబాద్,జూలై7 :** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ తనయుడు హిమాన్షుకు స్వల్ప గాయమైంది. నిన్న గేమ్స్ ఆడుతుండగా అతడి ముక్కుకు గాయమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే ఆస్పత్రికి చేరుకోగా.. సిద్దిపేటలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయల్దేరి కేసీఆర్ కూడా ఆస్పత్రికి వెళ్లారు. మనవడిని పరామర్శించి.. అతడి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు తాను కోలుకుంటున్నట్లు హిమాన్షు ఎక్స్ వేదికగా వెల్లడించారు. చిన్నపాటి గాయమవ్వడంతో గత రాత్రి ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత విశాంత్రి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు హిమాన్షు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదిగా స్పందించారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయ-ంమైందని, ప్రస్తుతం చికిత్స కొనసాగుతున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటాడని అన్నారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

### సీఈవోకు కోరిన బిజెపి నేతలు

**హైదరాబాద్, జూలై 7 :** సర్ పక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ ఖీ విషయం లో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్‌ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపిం చారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయ న్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.

## హ్యామ్ రోడ్ల నిర్మాణంతో మారనున్న రూపురేఖలు

- గతంలో ఎప్పుడూ లేనంతగా రోడ్ల నిర్మాణాలు
- గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జూలై 7 :** తెలంగాణ రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌ను గతంలో ఎప్పుడూ లేనంతగా అత్యద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఇటీవల సిఎం హ్యా రోడ్లకు శంకుస్థాపన చేయడంతో రాష్ట్ర రోడ్ల స్వరూపం మారబోతోందని అన్నారు. ఈ ప్రాంత ప్రజలతో తనకు ప్రత్యేకమైన, వెలకట్టలేని అనుబంధం ఉందని.. గతంలో ప్రజలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని మరి తనను ఎంపీగా గెలిపించారని ఆయన కృతజ్ఞతతో గుర్తుచేసుకు న్నారు. ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందుకే రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్రీకారం చుట్టామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల రూపురేఖల ను మార్చేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వెళ్తోందని మంత్రి వివరించారు. మొత్తం రూ. 13,000 కోట్ల భారీ వ్యయంతో, 34 ప్యాకేజీల కింద, 6,092 కిలోమీటర్ల మేర విస్తరించిన 441 రోడ్లను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నల్లగొండ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రమాదాలు లేని క్వాలిటీ రోడ్లుగా వీటిని తీర్చిదిద్దుతామని, రోడ్లు రద్దీగా ఉండే హైదరాబాద్ రూరల్ సర్కిల్ 1 / 2 ప్యాకేజీల్లోనే దాదాపు 30 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తాజాగా రూ. 338 కోట్ల వ్యయంతో 149 కిలోమీటర్ల మేర విస్తరించే 14 రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో నాలుగు లేన్ల రహదారుల నిర్మాణం ఒక చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా, ఈ ప్రాంత ప్రజల మనిషిగా అద్దం లాంటి రహదారులను నిర్మించి తీరుతామని.. ఈ రోడ్ల కనెక్టివిటీ ద్వారా రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయని మంత్రి వెంకట్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

## పోలీస్ శాఖలో అవినీతి నిర్మూలనకు చర్యలు

### ప్రలోభాలకు లొంగవద్దని పోలీసులకు డీజీపీ హెచ్చరిక

**ఖమ్మం,జూలై7 :** పోలీస్ వ్యవస్థలో అవినీతిని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ప్రలోభాలకు లొంగవద్దని సిబ్బందిని కోరుతున్నామని అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో డీజీపీ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కమిషనరేట్‌లో సిబ్బంది పనితీరుపై సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఖమ్మం కమిషనరేట్‌కి వచ్చానని తెలిపారు. ఖమ్మం తెలంగాణ రాష్ట్రానికి ముఖద్వారంగా ఉందని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై సమీక్షించానని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా జరుగుతున్న నేరాలపై సమీక్షించామని డీజీపీ తెలిపారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. 6500 మంది అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించామని అన్నారు. ప్రతి రోజూ 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సిబ్బంది పనిభారంపై చర్చించామని చెప్పుకొచ్చారు. ఏఐపై సిబ్బందికి ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. స్మగ్లర్లపై చాలా కఠినంగా చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. ఛత్తీస్‌ఘడ్, ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి ఫెడ్లర్లు వస్తున్నారని అన్నారు. సరిహద్దుల్లో గట్టి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సైబర్ క్రైంపై గట్టి నిఘా ఉంచామని వెల్లడించారు. సోషల్ మీడియాలో అసాంఘిక కార్యకలాపాలను ప్రచారం చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. ట్రాఫిక్ సిస్టమ్‌ను మెరుగుపరిచేందుకు ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను తీసుకువస్తున్నామని వెల్లడించారు. హైవేలపై అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని.. దీనివల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా విద్యాసాగర్

### చార్జ్ అప్పగించిన దివ్య దేవరాజన్

**హైదరాబాద్,జూలై7 :** సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సమక్షంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే.విద్యాసాగర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన దివ్య దేవరాజన్ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో కొత్తగా పోస్టింగ్ అయిన విద్యాసాగర్‌కు ఛార్జ్ అప్పగించారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జీ.చిన్నారెడ్డి వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. దివ్య దేవరాజన్ అందించిన సేవలను చిన్నారెడ్డి కొనియాడారు. నూతన స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ ఆధ్వర్యంలో సీఎం ప్రజావాణి కార్యక్రమం మరింత సజావుగా సాగుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



## 10న రైతు ఆశీర్వాద సభ

- రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం, జూలై 7 :** గత నెలలో రద్దయిన రైతు ఆశీర్వాద సభను తిరిగి ఈ నెల 10న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు.. సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను రికార్డ్ స్థాయిలో అందజేసిందని కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం ఏడు రోజుల్లోనే ఏకంగా 7,491 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని ఆయన స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఎల్‌నినోపై అగ్రివర్సిటీ చేసిన సూచనలు రైతులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే 'తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం'తో రైతులకు వాట్సప్ ద్వారా కచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అమలు చేస్తున్నాం.

## తెలంగాణ ఉద్యమకారులకు శాశ్వత ప్రయోజనాలు

- విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి
- కమిటీతో భేటీలో కాకతీయ జెఏసి సూచనలు

**హైదరాబాద్, జూలై 7 :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుతో పాటు వారి జీవితాల్లో సామాజిక భద్రత, సంక్షేమ సంస్కరణలే ధ్యేయంగా ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీ అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థి ఉద్యమకారులతో కలిసి ఒక ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ సభ్యులు,రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ , కమిటీ సభ్యులైన ప్రొఫెసర్ ఎమ్. కోదండరాం ,అద్దంకి దయాకర్. రాములు నాయక్ ,మోతే శోభన్ రెడ్డి పాల్గొని, కేయూ విద్యార్థి నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థి ఉద్యమకారులు తమ అమూల్యమైన సలహాలు ,సూచనలను కమిటీ ముందు ఉంచారు. కేవలం ఉద్యమకారుల గుర్తింపు కార్డులకే పరిమితం కాకుండా, వారి కుటుంబాలకు ఉపాధి, విద్య, వైద్యం మరియు పెన్షన్ వంటి రంగాలలో సామాజిక సంస్కరణలు తీసుకురావాలని, తద్వారా వారికి శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. పొన్నం ప్రభాకర్ ఇతర సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థుల పాత్ర చారిత్రాత్మకమైనది. కేవలం గుర్తింపు మాత్రమే కాకుండా, దశాబ్దాలుగా నష్టపోయిన ఉద్యమకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎలాంటి సామాజిక, సంక్షేమ సంస్కరణలు అవసరమో విద్యార్థి లోకం ఈరోజు అద్భుతమైన సూచనలు చేసింది. ఈ రోజు సేకరించిన అన్ని ప్రతిపాదనలను, సామాజిక సంస్కరణల విజ్ఞాపనలను త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్తాం. ఉద్యమకారుల కుటుంబాలకు అన్ని విధాలా పూర్తి న్యాయం జరిగేలా కమిటీ నివేదికను సిద్ధం చేస్తాం.'ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాకతీయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉద్యమకారులు పాల్గొన్నారు

# జనాభా పెరిగితే తట్టుకోగలమా?



**ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేందుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పడు రాష్టానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి.**

ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండిపెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు.

ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి.

ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యాలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.

# హర్మూజ్‌లో మరోసారి ఉద్రిక్తత

## రెండు నౌకలపై ఇరాన్ మిస్సైల్ దాడి



**టెహ్రాన్, జూలై 7 :** అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం ముగింపు కోసం అవగాహన ఒప్పందం కుదిరినా.. హర్మూజ్‌లో ఉద్రిక్తతలు పూర్తిస్థాయిలో తగ్గిపోలేదు. తాజాగా ఆ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న రెండు వాణిజ్యనౌకలపై క్షిపణి దాడి జరిగింది. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ ఆ దాడికి పాల్పడినట్లు అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. మరోవైపు, హర్మూజ్‌లో ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న ట్యాంకర్ ఒకటి మంటల్లో చిక్కుకుందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సెంటర్ వెల్లడించింది. ఈ దాడికి కూడా ఇరానే కారణమని అనుమానిస్తోంది. ఈ ఘటన వల్ల పర్యావరణంపై ఎలాంటి ప్రభావం లేదని పేర్కొంది. ఈ రెండు ఘటనల్లో ప్రాణనష్టం వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఇరాన్ దివంగత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ అంతిమయాత్ర జరుగుతోంది. ఈ సమయంలో ఈ వరుస దాడులు జరగడం గమనార్హం.

### మరోసారి ట్రంప్ హెచ్చరికలు..

అవగాహన ఒప్పందం నేపథ్యంలో హర్మూజ్‌లో ఎలాంటి అంతరాయాలు కలిగించమని ఇరాన్ అంగీకరించింది. అయితే.. ఇటీవల ఘర్షణల సమయంలో తమకు మద్దతు ఇచ్చిన దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామంటూ ఇరాన్ చెప్తోంది. ఆ దేశ వైఖరి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అసహనానికి గురిచేస్తోంది. దాంతో మరోసారి హెచ్చరికలు చేసింది. "అమెరికా ఒప్పందం కుదుర్చుకోవడమో లేకపోతే.. పనిపూర్తి చేయడమో చేస్తుంది. 'పని ముగించడం' అంతకష్టమేమీ కాదు. గంటల్లో వారి వంతెలను కూల్చివేయగలం. వారి విద్యుత్తు సరఫరాను నిలిపివేయగలం. వారి దగ్గర డబ్బులేదు. పరిస్థితులు ఇలా ఉన్నా.. నేను ఒప్పందానికే మొగ్గుచూపుతాను. ఎందుకంటే యుద్ధ ప్రభావం ఎవరిపైనా పడటం నాకు ఇష్టంలేదు" అని ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే.. ఇరాన్‌లో ఖమేనీ అంత్యక్రియల వేళ ట్రంప్‌పై ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ అంతాన్ని చూడాలంటూ ఖమేనీ అంత్యక్రియల ఊరేగింపులో నల్లని దుస్తుల్లో హాజరైన ప్రజలు పిడికిలి బిగించి నినాదాలు చేస్తున్నారు.

ఒకవైపు ఇలా ఆగ్రహం వ్యక్తం అవుతుంటే.. ట్రంప్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. "మనం మంచివాళ్లం కాబట్టి అంత్యక్రియల కోసం విరామం ఇచ్చాం" అంటూ ఆయన మీడియాతో మాట్లాడిన సంగతి తెలిసిందే.

# అయోధ్య చోరీలో కీలక ఆధారాలు సేకరణ

**కరెన్సీని జేబులు, బూట్లల్లో దాచుకుని తరలింపు**

**70సార్లు దొంగతనం..**
**చూసీచూడనట్లుగా అధికారులు**

**సిసి టివి ఫుటేజ్ ఆధారాలను సుకరించిన సిట్**



**అయోధ్య, జూలై 7 :** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక ఆధారాలను సేకరించినట్లు సిట్ వెల్లడించింది. ఈ విషయంపై యూపీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు విరాళాల లెక్కింపు చేపట్టిన వ్యక్తుల్లో కొందరు డబ్బులు అపహరించినట్లు సీసీటీవీ దృశ్యాల్లో తేలిందని పేర్కొంది. ఈ 39 రోజుల్లో లెక్కించే సమయంలో కొంతమంది సిబ్బంది కరెన్సీ నోట్ల కట్టలను, చిల్లరను తమ దుస్తులు, జేబులు, బూట్లలో దాచిపెట్టినట్లు సీసీటీవీ రికార్డుల్లో కనిపించిందని తెలిపింది. డబ్బును సిబ్బంది దొంగలిస్తున్నట్లు చూసిన కొందరు అధికారులు కూడా వారిని ఆపడానికి ప్రయత్నించలేదని సిట్ పేర్కొంది. నిందితులు దాదాపు 70 సార్లు దొంగతనాలకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, లెక్కింపు సిబ్బందిని విచారించామన్నారు. వారి వాంగ్మూలాల ప్రకారం ఏప్రిల్ 27కి ముందు కూడా విరాళాల చోరీ జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంలో ఆధారాలు సేకరించడం సవాలుగా మారిందన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ఐదేళ్ల ఖాతాలను రీఆడిట్ చేస్తున్నామని.. బ్యాంకు రికార్డులు, విరాళాల పత్రాలు, ఆలయ నిర్మాణ వ్యయాలు, బంగారం, వెండి వస్తువులతో సహా అన్ని ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆలయంలో భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ పరికరాలపై పరిమితులు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి చర్యల్లో అనేక లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లోపాలను వినియోగించుకుని నిందితులు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. విలువైన కానుకల నిర్వహణ, డాక్యుమెంటేషన్, తూకం వేయడం వంటి వాటిల్లోనూ పలు విధానపరమైన లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెళిష్ పాండే, రామశంకర్ మిశ్రాలకు ప్రమేయం ఉన్నట్లు నిర్ధరించారు. సీసీటీవీ దృశ్యాల్లో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్‌లు పలుమార్లు నగదు, నగలను అపహరిస్తున్నట్లు రికార్డ్ అయ్యిందని పేర్కొన్నారు.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**



**అహ్మదాబాద్, జూలై 7 :** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

## గుజరాత్‌లో భారీ వర్షాలు

**అహ్మదాబాద్,జూలై7 :** భారీ వర్షాలకు గుజరాత్‌లోని నీటి పారుదల ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. జోరువానలు గుజరాత్ అంతటా విస్తారంగా కురుస్తున్నాయి. దీంతె వాగులు వంకలు పొంగుతున్నాయి. భావ్‌నగర్ జిల్లా పాలితానాలోని శెత్రుంజీ డ్యామ్‌కు వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో జలాశయం 59 గేట్లను ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తున్న దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి.

## ఫ్రాన్స్ అధ్యక్షుడు ఉన్న హోటల్ వద్ద భారీ పేలుడు

**డమాస్కస్ :** సిరియా రాజధాని డమాస్కస్‌లో వరుస పేలుళ్ల తీవ్ర కలకలం రేపాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆ దేశ పర్యటనలో ఉండగా.. ఆయన బస చేసిన హోటల్ వద్దే ఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అయితే, ఈ ఘటనలో ఆయన క్షేమంగా బయటపడినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్–షరాతో సమావేశమయ్యేందుకు అధ్యక్ష భవనంలోకి మెక్రాన్ వెళ్లిన వెంటనే సమీపంలోని ఫోర్ సీజన్స్ హోటల్ వద్ద పేలుళ్లు సంభవించడం గమనార్హం. సుదీర్ఘ కాలంగా అంతర్యుద్ధంతో నలిగిపోయిన సిరియా.. ఇటీవల అక్కడ పాలకులు మారిన తర్వాత పునర్నిర్మాణంపై దృష్టి సారించింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పలు దేశాలు విధించిన అనేక ఆంక్షలను ఎత్తివేయడానికి పాశ్చాత్య దేశాలను ఒప్పించడంలో కీలక పాత్ర వహించిన మెక్రాన్.. అల్–షరా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆ దేశంలో కీలక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతినిధుల బృందంతో కలిసి డమాస్కస్‌లోని ఫోర్ సీజన్స్ హోటల్‌లోనే బస చేశారు. మెక్రాన్ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే.. హోటల్‌కు సమీపంలో రెండు పేలుళ్లు సంభవించాయి. చెత్తడబ్బాలో ఒకటి, పార్కింగ్ చేసిన కారులో మరో పేలుడు జరిగినట్లు సిరియా అధికారిక మీడియా తెలిపింది. ఈ ఘటనలో నలుగురు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం. అయితే, డమాస్కస్‌లోని జస్టిస్ ప్యాలెస్ సమీపంలోని ఓ కేఫ్‌లో ఇటీవలే భారీ పేలుడు సంభవించగా.. పది మంది ప్రాణాలు కోల్పోయారు.

## సింధూ జలాల్లో వాటా కోసం అన్ని చర్యలు తీసుకుంటాం: పాక్ ఆర్మీ

**ఇస్లామాబాద్ :** సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ ఒప్పందం ప్రకారం తమ దేశానికి రావాల్సిన సింధూ జలాల వాటాను పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని 276వ కోర్ కమాండర్ల సమావేశంలో పాక్ తన నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ దేశ రక్షణ దళాల అధిపతి ఆసిమ్ మునీర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ఆదేశాలు, దేశ ప్రజల ఆకాంక్షల మేరకు సింధూ జలాల కోసం పోరాడుతామని సైన్యం తెలిపింది. 2025 ఏప్రిల్ 24 నాటి జాతీయ భద్రతా కమిటీ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సింధూ జలాలను ఆపే ఎటువంటి ప్రక్రియనైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని తెలిపింది. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని..సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరని భారత్‌పై అక్కసు వెల్లగక్కింది. తాలిబన్ల నియంత్రణలో ఉన్న అఫ్గాన్‌లోని భూభాగాలను ఉపయోగించుకుని ఉగ్రవాదులు పాక్‌లోని పలు ప్రదేశాలపై దాడులు చేస్తుండడం పట్ల సైన్యం ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదం నుంచి తమ ప్రజలను రక్షించుకోవడానికి సాయుధ దళాలు నిరంతరం కృషి చేస్తున్నాయని పేర్కొంది. కశ్మీరీలకు పాకిస్థాన్ మద్దతు ఎప్పటికీ ఉంటుందని పునరుద్ఘాటించింది. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఈ ఒప్పందం జరిగింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ స్పష్టం చేసింది. 2028 జూన్ నాటికి సింధు నదీ జలాల ప్రవాహాన్ని పాకిస్థాన్‌కు పూర్తిగా నిలిపివేయవచ్చని భారత జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే పాక్ మంత్రులు, అధికారులు దీనిపై స్పందిస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారు.



## రాంపల్లిలో మందకృష్ణ జన్మదిన వేడుకలు

**నాగారం, జూలై 07 (జనం వార్త) :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు రాంపల్లి ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం నిర్వహించారు. నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం ఏబిసిడి వర్గీకరణకు అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బందెల పరమేష్, ఉపాధ్యక్షులు మీసాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి మంచాల నర్సింగరావు, కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాస్, చెట్లపల్లి నరసింహా, బందెల వెంకటేష్, నల్లోల రవి, నల్లోల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### జిల్లా, డివిజన్ అధ్యక్షులకు నియమాక పత్రాలు అందచేసిన వజ్రేష్ యాదవ్

**మేడ్చల్ :** మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నాడు బోడుప్పల్ లోని తన నివాసంలో జరిగిన సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గం నుండి నూతనంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీల చోటు దక్కించుకున్న కార్యవర్గ సభ్యులకు, నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులకు నియమాక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, సన్న బియ్యం, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలతో పాటు, సర్కారు బడులను బలోపేతం చేసి అట్టడుగు వర్గాలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించే సంకల్పంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల వివరాలను అందించాలని సూచించారు.

# విద్యే ఆయుధం.. క్రమశిక్షణే విజయానికి మార్గం

### మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి జూలై 7 (జనం వార్త):** విద్యనే జీవితాన్ని మార్చే ఆయుధమని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడ ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలయ్య ట్రస్ట్ ఫౌండేషన్ సౌజన్యంతో, ఖాజాగూడ సీనియర్ నాయకులు సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. క్రమశిక్షణతో నడుచుకుంటూ చదువుల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ విద్య వంటి అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనలో తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల బాధ్యతతో వ్యవహరించి బోధనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని కోరారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం బాలయ్య ట్రస్ట్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడిన గంగాధర్ రెడ్డి, సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసి బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్. వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివ సింగ్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, సుధాకర్, అరుణ్ గౌడ్, రాజేష్, వినయ్, కృష్ణ, సాయి, రాజు, బాలకృష్ణ, దినకర్, భారతమ్మ, నిర్మలమ్మ, సుమన్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు చదువును సేవగా కాకుండా వ్యాపారంగా మార్చేశాయన్న విమర్శలు రోజురోజుకూ బలపడుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, యాన్యువల్ చార్జీలు, యాక్టివిటీ ఫీజుల పేరుతో ఇప్పటికే తల్లిదండ్రులపై భారీ భారం మోపుతున్న యాజమాన్యాలు... ఇప్పుడు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలను కూడా పాఠశాలల్లోనే విక్రయిస్తూ లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నా, అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.




# చెల్లింపుల చక్రవ్యూహమా?

ఖమ్మంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజులు, పుస్తకాల పేరిట బహిరంగ దోపిడీ

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ప్రాంగణాల్లోనే పుస్తకాల విక్రయాలు

రెండో తరగతి పుస్తకాలకే రూ.5 వేల వరకు వసూళ్లు

ఫిర్యాదులు వచ్చినా స్పందించని విద్యాశాఖపై విమర్శలు



### పుస్తకాల పేరుతో భారీ దోపిడీ

రెండో తరగతి విద్యార్థి పుస్తకాలకే రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పై తరగతుల్లో ఈ మొత్తం మరింత పెరుగుతోందని చెబుతున్నారు. బయట మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను, "స్కూల్ ప్రత్యేక ప్రచురణలు" అనే పేరుతో అనేక రెట్లు అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఒకే దుకాణానికి పరిమితం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

### చట్టాలు ఏమంటున్నాయి?

- ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ప్రభుత్వ నిబంధనలకు లోబడే పనిచేయాలి.
- పాఠశాలల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధం.
- తల్లిదండ్రులను ఒక నిర్దిష్ట దుకాణం లేదా పాఠశాల నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనాలని బలవంతం చేయరాదు.
- ఫీజులు, ఇతర చార్జీల వివరాలను పారదర్శకంగా ప్రకటించాలి.
- విద్య హక్కు చట్టం -- 2009 ప్రకారం విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఆర్థిక భారం మోపే చర్యలను ప్రభుత్వం నియంత్రించే అధికారం కలిగి ఉంది.
- సంబంధిత రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం అనధికారిక వసూళ్లు, బలవంతపు కొనుగోళ్లు, నిబంధనలకు విరుద్ధమైన వాణిజ్య కార్యకలాపాలపై చర్యలు తీసుకోవచ్చు.

> **"చదువు హక్కు.. దోపిడీ కాదు"**
>
> విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. ఆ హక్కును వ్యాపారంగా మార్చి సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం మోపడం సమాజానికి ప్రమాదకరం. ప్రభుత్వం, విద్యాశాఖ వెంటనే స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థల ఆర్థిక అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటేనే తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుంది.

### ఫిర్యాదులు... కానీ చర్యలేవీ?

విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు పలుమార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. తనిఖీలు జరిగినా అవి కేవలం కంటితుడుపు చర్యలుగానే మిగిలిపోతున్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### సామాన్య కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం

- ఒకవైపు పెరుగుతున్న జీవన వ్యయం... మరోవైపు ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, పుస్తకాల పేరుతో వేల రూపాయల అదనపు భారం... దీంతో సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.
- "పిల్లలకు మంచి చదువు చెప్పించాలనుకుంటే అప్పులు చేయాల్సి వస్తోంది. ఫీజుల కంటే పుస్తకాలకే వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ దోపిడీని అరికట్టాలి" అని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తక్షణమే చేపట్టాల్సిన చర్యలు

- జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి.
- పాఠశాలల్లో జరుగుతున్న పుస్తకాల విక్రయాలపై విచారణ చేపట్టాలి.
- అనధికారిక ఫీజులు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి.
- నిబంధనలు ఉల్లంఘించిన విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసే వరకు కఠిన చర్యలు తీసుకోవాలి.
- ఫీజుల నియంత్రణకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసి తల్లిదండ్రుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి.

## సీతారామ ప్రాజెక్టుపై కార్యాచరణ ప్రకటించాలి

### సాగుదారులందరికీ పోడు హక్కులు కల్పించాలని సీపీఐ(ఎం) డిమాండ్

**కారేపల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో సభలు నిర్వహించడం మాత్రమే కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కార్యదర్శి కే. నరేంద్ర అధ్యక్షతన ఉసిరికాయలపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న చింతకాని మండలం జగన్నాధపురంలో జరగనున్న ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభలో సీతారామ ప్రాజెక్టుకు పూర్తి నిధులు విడుదల చేసి, పనులు త్వరగా పూర్తి చేసే కార్యాచరణను ప్రకటించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సింగరేణి, కారేపల్లి, రఘునాథ పాలెం మండలాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు జూలూరుపాడు--వర్ధగుట్ట టన్నెల్ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనేతర రైతులకు కూడా హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. సింగరేణి కోల్ మైన్స్, మాదారం స్టీల్ ప్లాంట్, డోలమైట్ మైనింగ్ సంస్థల ద్వారా అభివృద్ధి నిధులు తీసుకువచ్చి సింగరేణి మండలంతో పాటు పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల రెండో దశలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని, కేవలం సభలతో సరిపెట్టకుండా సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు వజ్జా రామారావు, బానోత్ బస్సీలాల్, కొండబోయిన ఉమావతి, దాసరి మల్లయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కేరళంలో భారీ వర్షాలు

- వర్షాలకు వయనాడ్ అతలాకుతలం
- కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి
- మట్టి దిబ్బల కింద పలువురిని కాపాడిన సిబ్బంది
- సహాయక చర్యలకు అడ్డంకిగా వాతావరణం
- వర్షాలపై సిఎం సతీశన్ అత్యవసర భేటీ.. వయనాడ్‌కు ఇద్దరు మంత్రులు



**తిరువనంతపురం, జూలై 7 :** కేరళంలో కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో ప్రమాదానికి దారితీశాయి. మంగళవారం మెప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం వద్ద భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. భారీ వర్షాలకు వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. మంగళవారంమధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, మట్టి కింద కూరుకుపోయిన ఆరుగురిని స్థానికులు రక్షించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొంతమంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మలప్పురం, వయనాడ్ జిల్లాలను కలిపే సొరంగ మార్గం నిర్మాణ పనులు జరుగుతున్న మీనాక్షి వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి వయనాడ్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారీగా మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా కొండపై నుంచి కూలిపడి నిర్మాణ ప్రాంతాన్ని పూర్తిగా కప్పివేశాయి. ప్రమాదం సంభవించగానే అక్కడ ఉన్న కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కనీసం ఐదుగురు గాయపడగా, మరికొందరు మట్టిలో చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు కలిసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు ఈ ప్రమాదంపై కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీషన్ వెంటనే జిల్లా మంత్రులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక, పునరావాస చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. వయనాడ్‌కు వెళ్లి సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు అగ్నిమాపక, పోలీసు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దింపి సహాయక చర్యలు చేపట్టారు. యనాడ్‌లో సోమవారం నుంచి భారీ వర్షాలు పడుతుండగా సొరంగం పనులను అదే రోజు నుంచి ప్రాజెక్టు అధికారులు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సొరంగ మార్గం ప్రాజెక్టు కోసం పని చేసే కార్మికులు నివసించే వసతి గృహంపై కొండచరియలు పడ్డాయి. అలాగే, కొన్ని నివాస గృహాలు, హోమ్‌స్టేలపైనా భారీగా మట్టి, రాళు వచ్చిపడ్డాయి. దీంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. మరోవైపు శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు, స్థానికులు ఉండొచ్చని సహాయక చర్యలు చేపట్టిన అధికారులు భావిస్తున్నారు. అనేక వాహనాలు, ఇళ్లు దెబ్బతినగా.. నష్టాన్ని అధికారులు ఇంకా అంచనా వేయలేదు. శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కొండచరియల కింద చిక్కుకున్న కొంతమంది కార్మికులను సహాయక సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వీటికి ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో దాదాపు 100 మంది నివసిస్తున్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొండచరియల కారణంగా మలప్పురం - వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు, మీనాక్షి వంతెన వద్ద నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వయనాడ్‌లో 2024లోనూ కొండచరియలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. నాడు ముండక్కై, చూర్‌మాలా ప్రాంతాల్లో బండరాళ్లు విరిగిపడి 298 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. భారీ వర్షాల కారణంగా రెస్క్యూ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. భారత వాతావరణ శాఖ కేరళంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది. కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.



## వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

- నిర్ణీత సమయానికి జిఎంఆర్ సంస్థ నిర్మాణాలు
- ప్రధాని చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం
- పనులపై సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయనగరం, జూలై 7 :** భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది మెరుగుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎంఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని అన్నారు. ఆ ఆదేశాలు మేరకు అనుకున్న సమయానికే జీఎంఆర్ సంస్థ ఎయిర్‌పోర్టును నిర్మించిందని చెప్పారు. ఎయిరో డ్రో లైసెన్స్ కూడా వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన వారం తర్వాత ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. మోదీ షెడ్యూల్ ఖరారైన తర్వాత తేదీ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భోగాపురానికి తరలిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో 4 కోట్ల మంది ప్రయాణించే విధంగా టెర్మినల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 78,000 చదరపు మీటర్ల మేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు.. దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా ఉందని కితాబిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర కళలు, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేపట్టినట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

**విజయవాడ,జూలై7 :** ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థిని అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అట్లూరి ప్రసన్న.. న్యూయార్క్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆమె తన స్నేహితులతో కలిసి కారులో సమీపంలోని గుడికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వీరి కారును మరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసన్నతో పాటు మరో అమ్మాయి ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలవ్వగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రసన్న స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామం. ఇటీవలే పేస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా.. ఇలా రోడ్డు ప్రమాదంలో కన్నుమూయడంతో ఆమె కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## జోసఫ్ రావణ్‌ను ఎలా సమర్థిస్తారు ?

**జగన్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



**నెల్లూరు,జూలై7 :** జోసఫ్ రావణ్ వంటి వ్యక్తిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమర్థించడం దుర్మార్గమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. దేవుళ్లు, పీఠాధిప తులపై జోసఫ్ రావణ్ తీవ్ర వ్యాఖ్యలు చేసినా జగన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జోసఫ్ రావణ్‌ను ఎందుకు సమర్థిస్తున్నారని నిలదీశారు. దేవుడిని నమ్మడం, నమ్మకపోవడం వ్యక్తిగత విషయమని, కానీ ఎవరికీ మత విశ్వాసాలను అవమానించే హక్కు లేదన్నారు. జోసఫ్ రావణ్‌పై నమోదైన కేసులను న్యాయస్థానాలే తేల్చాలని, అలాంటి కేసులు పెట్టడం తప్పని ఎలా చెబుతారని జగన్‌ను ప్రశ్నించారు. జోసఫ్ రావణ్‌ను జగన్ సమర్థించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించిన కోటంరెడ్డి, వైసీపీ అధ్యక్షుడిగా జగన్.. భారతీయులకు, అన్ని మతాల ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, గతంలో వైఎస్ భారతిపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకున్న విషయాన్ని ప్రస్తావించిన ఆయన, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కూడా జోసఫ్ రావణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్యే కోటంరెడ్డి వివరించారు.

## కాశ్మీర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

**దోడా జిల్లాలో ఆకస్మిక వరదలు.. విరిగిపడ్డ కొండచరియచలు**

**శ్రీనగర్, జూలై 7 :** భారీ వర్షాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. డోడా జిల్లాలో మంగళవారం ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద, బండరాళ్లు కొట్టుకురావడంతో తాత్రి పట్టణంలో పలువురి ఇళ్లు, దుకాణాలు, వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాణనష్టం ఏమీ జరగలేదని అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా డోడా, కిష్త్వార్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు రావడం ఇది మూడోసారి. మంగళవారం సంభవించిన వరదలకు తాత్రి పట్టణంలో రోడ్డుపక్కన నిలిపిన అనేక వాహనాలు మట్టిలో కూరుకుపోగా, కొన్ని చీనాబ్ నదిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదల కారణంగా డోడా-కిష్త్వార్ జాతీయ రహదారి తాత్రి వద్ద మూసుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రహదారిని పునరుద్ధరించే పనులను అధికారులు చేపట్టారు. వదంతులు నమ్మవద్దని, ప్రజలు అధికారిక సమాచారం కోసం కంట్రోల్ రూం లేదా జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని డిప్యూటీ కమిషనర్ కృష్ణన్ లాల్ సూచించారు.

## దక్షిణకొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

**వివిధ కంపెనీలతో పెట్టుబడులపై విస్తృతంగా చర్చలు**

**హ్యుందాయ్, మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ**



**అమరావతి, జూలై 7 :** ఏపీకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా దక్షిణ కొరియాలో మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. హ్యుందాయ్ మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో హ్యుందాయ్ మోబిస్ ఆర్ అండ్ డీ/ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి,అనంతపురం ప్రాంతంలో ఈవీ కాంపోనెంట్స్, బ్యాటరీ సిస్టమ్స్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. ఐఐటీ తిరుపతితో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అటానమస్ డ్రైవింగ్, ఆడాస్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశోధనలకు హ్యుందాయ్ మోబిస్‌తో లోకేశ్ భాగస్వామ్యం కోరారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని హ్యుందాయ్ మోబిస్‌కు వినతి చేశారు. టైర్-1 ఆటోమొబైల్ సరఫరాదారుల సమావేశాన్ని ఏపీలో నిర్వహించాలని ప్రతిపాదించారు. హ్యుందాయ్ మోబిస్ విస్తరణకు ఏపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. అనంతపురం యూనిట్‌లో హ్యుందాయ్,



కియా కోసం కీలక మాడ్యూల్స్ తయారు చేయనున్నట్లు హ్యుందాయ్ మోబిస్ తెలిపింది. ఏపీ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి లోకేశ్ సమావేశ మయ్యారు. ఓఎస్ఏటి సెమీకండక్టర్ నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఏపిలో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని అపాక్ట్‌కు ప్రతిపాదన చేశారు. ఇతర ఓఎస్ఏటి కంపెనీలను ఏపీకి తీసుకురావాలని అపాక్ట్‌ను కోరారు. హనా మైక్రాన్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి చెప్పారు. విశాఖ ప్రాజెక్టు ఏపీకి ప్రతిష్ఠాత్మక విజయమని.. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని అపాక్ట్ సీఈవో వెల్లడించారు. విశాఖలో యూనిట్ నిర్మాణం త్వరలో ప్రారంభంకానుంది. రూ.468 కోట్ల పెట్టుబడితో విశాఖలో సెమీకండక్టర్ యూనిట్ రానుంది. ఏడాదికి 9.6 కోట్ల పరికరాల తయారీ లక్ష్యంతో విశాఖ యూనిట్ పనిచేయనుంది.

## మతాల మధ్య చిచ్చుకు వైసీపీ యత్నం

- హిందువులపై విషం చిమ్ముతున్న ప్రశ్న రావణ్, ప్రకాశ్ రాజ్,జడ శ్రవణ్
- వీరందరికి మద్దతుగా నిలుస్తున్న వైసిపి నేతలు
- మండిపడ్డ ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద

**విశాఖపట్నం, జూలై 7 :** మతాల మధ్య చిచ్చుపెట్టాలని వైసీపీ చూస్తోందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. ప్రశ్న రావణ్, జడ శ్రవణ్ కుమార్, ప్రకాశ్ రాజ్.. ప్రతిరోజూ హిందువులపై విషాన్ని చిమ్ముతున్నారని మండిపడ్డారు. హిందూ వ్యతిరేకంగా ఉన్నవారందరికీ వైసీపీ న్యాయ సహాయం చేస్తోందన్నారు. మంగళవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల పేర్లు పెట్టుకుని సనాతన ధర్మాన్ని కించపరిచేలా నటుడు ప్రకాశ్ రాజ్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల ఆరాధ్య దైవాలను కించపరిచే హక్కు ఎవరిచ్చారని స్వామీజీ ప్రశ్నించారు. ప్రభుత్వం.. తప్పులు చేస్తున్న వారిని చట్టప్రకారం అరెస్టు చేస్తుంటే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన తప్పులను ఎత్తి చూపినందుకే తమను టా÷-గ్గ÷ట్ చేశారన్నారు. హిందూ మనోభావాలను దెబ్బతీస్తూ చేస్తున్న వ్యాఖ్యల వెనుక వైసీపీ కుట్ర ఉందని స్వామి శ్రీనివాసానంద ఆరోపించారు. తమిళనాడు సీఎం విజయ్‌పై స్వామి శ్రీనివాసానంద సరస్వతి ప్రశంసలు కురిపించారు. హిందూ ఆలయాల నుంచి వచ్చే నిధులను ఆలయాల అభివృద్ధి కోసమే వాడుతామని తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. విజయ్ నిర్ణయాన్ని తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. హిందూ ఆలయాల నిధులను ఇతర అవసరాల కోసం మళ్లించకూడదని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సీఎంలు కూడా తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయమే తీసుకోవాలని స్వామీజీ కోరారు. ప్లాన్ ప్రకారమే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై దాడులు చేస్తున్నారని హిందూ సంఘాల నేత తురగా శ్రీరామ్ అన్నారు. ఏపీలో రిజర్వేషన్ల జిహాద్ జరుగుతోందని ఆరోపించారు. రిజర్వేషన్లను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్లు లాక్కునేవారి వెనుక నాయకులు ఉన్నారని వ్యాఖ్యానించారు. కొంతమంది యూట్యూబర్, జర్నలిస్టుల ముసుగులో హిందుత్వంపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్న రావణ్‌కు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మద్దతు ఇస్తున్నారంటే అర్థం ఏంటి అని శ్రీరామ్ ప్రశ్నించారు.



## తుంగభద్రకు కొత్త నీరు రాక

**ఎగువన వర్షాలతో మొదలైన ప్రవాహం**

**కర్నూలు, జూలై 7 :** ఆలస్యమైనా తుంగభద్రకు నీటి రాకడ మొదలైంది. అడుగంటిన తుంగభద్ర జలాశయంలోకి కొత్తనీరు చేరుతోంది. డ్యాం పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా సోమవారం 1550 క్యూసెక్కుల వరద మొదలై.. సాయంత్రానికి 2,159 క్యూసెక్కులకు పెరిగింది. రెండు రోజుల కిందటివరకూ చుక్కనీరు రాకపోవడంతో డ్యాం వెలవెలబోయింది. రైతాంగం, అధికార యంత్రాంగంలో నిస్తేజం అలుముకుంది. ఈ తరుణంలో నైరుతి రుతుపవనాలు కరుణించాయి. కర్ణాటకలోని మలెనాడు, తుంగభద్ర ఎగువ పరివాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తుంగ, భద్ర నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. తుంగ జలాశయం నిండటంతో పదిగేట్లను ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని సోమవారం దిగువకు విడుదల చేశారు. అక్కడి నుంచి తుంగభద్ర జలాశయానికి వరద నీరు చేరేందుకు సుమారు 310 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. మరో రెండురోజుల్లో ఆ నీటి చేరికతో వరద పెరగనుంది. భద్ర జలాశయం కూడా నిండితే, వరద మరింత పెరుగుతుంది. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 1587.92 అడుగుల వద్ద 9.379 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 77.343 టీఎంసీల నీరు ఉన్నింది. తుంగభద్ర డ్యాంకు వరద ఆలస్యం కావడం ఇదే మొదటిసారి కాదు. 2002-03, 2003-04, 2004-05, 2016-17, 2023-24 నీటి సంవత్సరాల్లోనూ వరద ఆలస్యమైంది. కొన్నిసార్లు జూలై రెండోవారంలోనూ వదర మొదలైంది. జూలై, ఆగస్టు నెలల్లోనూ వర్షాభావ పరిస్థితుల కారణంగా చెప్పుకోదగ్గ వరద రాలేదు. డెడ్ స్టోరేజీకి పడిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

## ముంబైని ముంచెత్తిన జోరువాన


- మహారాష్ట్రలో పలు ప్రాంతాల్లో 600మి.మీ వర్షపాతం
- ముంబై వీధులన్నీ జలమయం.. బయటకు రావద్దని హెచ్చరిక

**ముంబై, జూలై 7 :** దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంబైలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైలు సేవలు చాలా వరకు నిలిచిపోయాయి. కొన్ని విమాన సర్వీసులు రద్దు కాగా, వందలాది విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో 600 మిలీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో ముంబై-పుణె మార్గంలోని కర్జత్-లోనావాలా ఘాట్ రోడ్డులో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ రూట్‌లో రెండ్రోజులుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక, పుణె జిల్లాలోని ప్రముఖ హిల్ స్టేషన్ అయిన లోనవాలాలో గత 24 గంటల వ్యవధిలో 670 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ముంబై, థానే, పుణె, పాల్ఘర్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఐఎండీ తాజా అంచనాల ప్రకారం, మహారాష్ట్రలోని కోంకణ్ ప్రాంతంతో పాటు పశ్చిమ కనుమల పరిసరాల్లో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇక, ముంబైలో మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటికే ముంబై నగరం జలమయంగా మారింది. దీంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు అధికారులు సూచించారు.

# ఇ-25 పెట్రోల్‌పై ఇంకా ఆ ప్రతిపాదనలు లేవు : కేంద్రం



ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియలో భాగంగా ఇ-25 పెట్రోల్‌ను కూడా తీసుకొస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. పలు వాహన మోడళ్లపై ఇ-25 పెట్రోల్ ఇంకా పరీక్షల దశలోనే ఉందని పేర్కొంది. ఆ నివేదికలు రాకముందే ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని వెల్లడించింది. ఇ-25 పెట్రోల్ రోల్‌అవుట్ చేశారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని కేంద్రం పేర్కొంది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి ఇలాంటివి వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని కోరింది. నిబంధనలకు అనుగుణంగా అన్ని దశల పరీక్షల్లో సత్ఫలితాలు వచ్చాకనే ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియ తీసుకొచ్చామని కేంద్రం స్పష్టం చేసింది. ఇ-20 పెట్రోల్ పూర్తిగా సురక్షితమైనదని మరోసారి స్పష్టం చేసింది. కాగా, ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల ద్విచక్ర వాహనాలు, 20 లక్షల ఫోర్ వీలర్ వాహనాలు నడుస్తున్నాయని, వాటిలో ఎలాంటి సమస్యలూ రాలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.






# నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్ పడింది. గత నాలుగు సెషన్లలో లాభాలను ఆర్జించిన సూచీలు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ఊగిసలాడాయి. బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, మెటల్, రియాల్టీ షేర్ల పతనం సూచీలపై ప్రభావం చూపింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 104.35 పాయింట్లు కోల్పోయి 78,180.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 31.65 పాయింట్లు పతనమై 24,398.70 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టైటాన్, ఎటర్నల్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ట్రెంట్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎల్ అండ్ టీ, రిలయన్స్, ఐసీఐసీఐ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 94.94గా ఉంది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ 4,137 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# శాంసన్ ఔట్.. మళ్లీ అదే తప్పు చేస్తున్నారు : మహ్మద్ కైఫ్

ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో సంజు శాంసన్‌ను తుది జట్టు నుంచి తప్పించి వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇచ్చారు. అభిషేక్ శర్మతో కలిసి వైభవ్ ఓపెనర్‌గా వచ్చాడు. అయితే, శాంసన్‌ను తప్పించి ఎడమచేతివాటం బ్యాటర్లను ఓపెనింగ్‌కు పంపడాన్ని మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ తప్పుబట్టాడు. ఈ విషయంలో భారత్ మరోసారి వ్యూహాత్మక తప్పిదం చేస్తోందన్నాడు. ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచ కప్ ఆరంభంలో ఇషాన్ కిషన్, అభిషేక్‌ను ఓపెనర్లుగా పంపారు. ఆ ప్రయోగం బెడిసికొట్టడంతో శాంసన్‌ను ఓపెనర్‌గా బరిలోకి దింపగా.. భారీ ఇన్నింగ్స్‌లతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిం చాడు. ఈ విషయాలను కైఫ్ తాజాగా ప్రస్తావించాడు. "టీ20 వరల్డ్ కప్‌లో చేసిన తప్పునే భారత్ మళ్లీ చేస్తోంది. ఇషాన్ కిషన్, అభిషేక్ ఓపెనర్లుగా వచ్చారు. ప్రత్యర్థి జట్టు ఆఫ్ స్పిన్నర్‌ను ప్రయోగించగానే వారు పెవిలియన్ చేరారు. భారీ ఓటమిని (సౌతాఫ్రికా చేతిలో) చవిచూసేంత వరకు శాంసన్‌కు ఆడే అవకాశం దక్కలేదు. ఓపెనింగ్ కాంబినేషన్‌లో కుడిచేతివాటం బ్యాటర్, ఎడమచేతి వాటం బ్యాటర్ ఉంటే బాగుంటుంది. ఇది మనం ప్రపంచ కప్‌లో చూశాం. తొలుత ఇషాన్, అభిషేక్ ఆఫ్ స్పిన్నర్లను ఎదుర్కోవడానికి ఇబ్బంది పడ్డారు. కానీ, సంజు రాకతో ఆ సమస్యకు పరిష్కారం దొరికింది. ఇప్పుడు ఇంగ్లాండ్‌లో భారత్ మళ్లీ అదే తప్పు చేస్తోంది. అభిషేక్, వైభవ్ సూర్యవంశీ దీర్ఘకాలం ఓపెనర్లుగా ఉండలేరు. ఓపెనర్‌గా ఒక కుడిచేతి వాటం బ్యాటర్ ఉండాలి. శాంసన్ ఒకట్రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. అతడి ఆట తీరు అలాంటిదే. శాంసన్ కెరీర్ చూస్తే అది మనకు అర్థమవుతుంది. అతడు సవాళ్లను ఎదుర్కొని భారీ శతకం సాధించగలడు. అతడిని ఓపెనర్‌గా పంపి అభిషేక్ లేదా వైభవ్‌ను మూడో స్థానంలో ఆడించాలి. మరో మార్గం లేదు" అని మహ్మద్ కైఫ్ వివరించాడు.

# 76 పరుగులకే ఆలౌట్

## భారత్ ఖాతాలో చెత్త రికార్డు



**ట్రెంట్ బ్రిడ్జ్:** భారత్‌తో జరిగిన మూడో టీ20లో ఇంగ్లాండ్ 125 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి టీమిండియా 11.4 ఓవర్లలో 76 పరుగులకే ఆలౌటయ్యింది. అభిషేక్ శర్మ (10), వైభవ్ సూర్యవంశీ (13), ఇషాన్ కిషన్ (13), అక్షర్ పటేల్ (10), హర్షిత్ రాణా (9) శ్రేయస్ అయ్యర్ (5), వరుణ్ చక్రవర్తి (5), అర్ష్‌దీప్ సింగ్ (4), తిలక్ వర్మ (3), శివమ్ దూబె (2) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ నాలుగు వికెట్లు, జోఫ్రా ఆర్చర్ 3, ఆదిల్ రషీద్ 2, విల్ జాక్స్ ఒక వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో విజయంతో 5 టీ20ల సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-0తో ముందంజలో ఉంది. ఇంగ్లాండ్‌తో 202 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 2, 3, 4, 5.. 8, 9, 10, 11, 12 ఇలా వరుస ఓవర్లలో వికెట్లు కోల్పోయింది. ఈ మ్యాచ్‌లో పరాజయంతో తాను ఆడిన టీ20ల్లో అత్యధిక పరుగుల (125) తేడాతో ఓడిపోయిన చెత్త రికార్డును భారత్ మూటగట్టుకుంది. అంతకుముందు 2019లో న్యూజిలాండ్‌తో 80 పరుగుల తేడాతో పరాజయం పాలయ్యింది. అదేవిధంగా ఆలౌట్‌కు సంబంధించి భారత్‌కు ఇది రెండో అత్యల్ప స్కోరు (76). 2008లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో 74 పరుగులకే ఆలౌటయ్యింది.

# అసత్య ప్రచారాలకు ముగింపు పలకాలి

## మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్



భారత టీ20 మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ ఫేక్ స్టేట్‌మెంట్‌పై స్పందించాడు. ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని అభిమానులకు, నెటిజన్లకు విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశాడు. టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత సూర్యకుమార్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. అంతేగాక ఇంగ్లండ్ పర్యటన, ఆసియన్ గేమ్స్ జట్లలో కూడా అతనికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో తనకు సరైన గౌరవం ఇవ్వలేదని, భవిష్యత్తుపై బీసీసీఐ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని సూర్యకుమార్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా ఓ తప్పుడు ప్రకటన సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చింది. ఈ వివాదంపై సూర్యకుమార్ స్పందిస్తూ.. "నా పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఒక స్టేట్‌మెంట్‌ను నేను గమనించాను. నేను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, వాటికి ఎలాంటి అధికారం ఇవ్వలేదని స్పష్టం చేయాలనుకుంటున్నాను. దయచేసి ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దు, షేర్ చేయవద్దు" అని తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఈ వివాదానికి ముగింపు పలకాలని భావిస్తూ, టీమిండియాకు తన పూర్తి మద్దతును ప్రకటించాడు. "జట్టు విజయం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. వారికి ఎల్లప్పుడూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మన కుర్రాళ్లు అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నారని నాకు తెలుసు. వారికి నా పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుంది. నాపై తప్పుడు ఆరోపణల కంటే భారత క్రికెట్, నా సహచరులు, ఆటకు నేను ఇచ్చే మద్దతే బలంగా మాట్లాడుతుంది" అని సూర్యకుమార్ వివరించాడు. ఇదే సందర్భంగా 15 ఏళ్ల 99 రోజుల వయ-సులో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించిన యువ కెరటం వైభవ్ సూర్యవంశీపై సూర్యకుమార్ ప్రత్యేక ప్రశంసలు కురిపించాడు. "వైభవ్, నువ్వు ఒక అద్భుతమైన ప్రయాణం ప్రారంభంలో ఉన్నావు. ప్రతి క్షణాన్ని ఆస్వాదించు, దేశం గర్వపడేలా చేయాలి" అని అతనికి శుభాకాంక్షలు తెలిపాడు.




# ఆగస్టు 1 నుంచి ఓపెన్ మార్కెట్ బైబ్యాక్

స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఓపెన్ మార్కెట్ బైబ్యాక్ ప్రక్రియను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పునరుద్ధరించింది. సవరించిన మార్పులతో ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఇకపై ఆఫర్ ప్రారంభమైన రోజు నుంచి 66 పనిదినాల్లోపే కంపెనీ బైబ్యాక్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎలాంటి బైబ్యాక్ విండో లేకుండానే రెగ్యులర్ ట్రేడింగ్‌లో షేర్లను తిరిగి కొనుగోలు చేయొచ్చు. క్యాపిటల్ మార్కెట్ల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు సెబీ ఈ చర్యలను చేపట్టినట్లు తెలుస్తోంది. 2025లో ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను సెబీ గతంలో నిలిపివేసింది. ప్రస్తుతం బైబ్యాక్ ప్రక్రియలో కంపెనీ నిర్దేశిత ధర వద్ద, తమ వాటాదార్ల నుంచి షేర్లను తిరిగి కొనుగోలు చేస్తుంటుంది. కానీ ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీలో ఆ రోజు ఉన్న ధర వద్ద షేర్లను కంపెనీ తిరిగి కొనుగోలు చేస్తుంది. గతంలో ఈ గడువు 6 నెలలుగా ఉండగా.. ఇప్పుడు 66 పని దినాల్లోపే ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను పూర్తి చేయడం తప్పనిసరి చేసింది. ఆఫర్ కాలంలోని మొదటి అర్ధభాగంలోనే బైబ్యాక్‌కు కేటాయించిన నిధుల్లో కనీసం 40 శాతం నిధులను కంపెనీ ఉపయోగించాల్సి ఉంటుంది. గతంలో కంపెనీలపై పడే పన్ను భారాన్ని ఇకపై వాటాదార్లపైకి మార్చారు. దీని వల్ల ఓపెన్ మార్కెట్‌లో షేర్లు అమ్మినా లేదా బైబ్యాక్‌లో టెండర్ చేసినా పన్ను ఒకేలా ఉంటుంది. ఈ సమాచారాన్ని ఈమెయిల్/ఎస్సెమ్మెస్ ద్వారా మదుపర్లకు తెలియజేయాలి. బైబ్యాక్ ప్రతిపాదనల కోసం కచ్చితంగా మర్చంట్ బ్యాంకర్‌ను నియమించాలనే నిబంధననూ సెబీ తొలగించింది. దీనివల్ల కంపెనీలకు అదనపు ఖర్చులు తగ్గనున్నాయి.




# 'ఇప్పుడు మా వ్యాపారం బాగోలేదు'

## : 3200 మందికి ఎక్స్‌బాక్స్ లేఆఫ్‌లు

దిగ్గజ కంపెనీల్లో ఈ ఏడాది కూడా కొనసాగుతోన్న లేఆఫ్‌లు ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా మైక్రోసాఫ్ట్‌కు చెందిన గేమింగ్ విభాగం 'ఎక్స్‌బాక్స్' 3200 మందికి ఉద్వాసన పలకనున్నట్లు ప్రకటించింది. సోమవారం ఒక్కరోజే వీరిలో 1600 మందిని తొలగించిన ఈ విభాగం.. 2026-27 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మిగతా లేఆఫ్‌లు పూర్తవుతాయని వెల్లడించింది. ఈ సందర్భంగా 'ఎక్స్‌బాక్స్' సీఈఓ ఆశా శర్మ.. ఉద్యోగులకు ఉద్వేగభరిత మెయిల్ చేశారు. ప్రస్తుతం తమ వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఈ క్లిష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "ఎక్స్‌బాక్స్ చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను మొదలుపెట్టాం. ఎన్నో సమీక్షల అనంతరం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మా విభాగంలో ఉద్యోగుల సంఖ్యను 3200 మేర తగ్గించాలని నిర్ణయించుకున్నాం. ఇది చాలా బాధకరమైన విషయమని నాకు తెలుసు. కానీ, ప్రస్తుతం మేం ఎదుర్కొంటోన్న సవాళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. ఇప్పుడు మా వ్యాపారం బాగోలేదు. పోటీ సంస్థలతో పోలిస్తే 3-10రెట్లు తక్కువ మార్జిన్లు చూస్తున్నాం. ఇక, ప్రస్తుతం ఈ ఇండస్ట్రీ కూడా తీవ్రమైన హార్డ్‌వేర్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అందువల్ల ఎక్స్‌బాక్స్‌ను రీసెట్ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇందులో భాగంగానే మా విభాగాన్ని కూడా విభజిస్తున్నాం. నాలుగు స్టూడియోలు కొత్త యాజమాన్యం చేతుల్లోకి వెళ్తాయి. అయితే, ఈ ఉద్యోగుల కోతల నిర్ణయం టాలెంట్‌పై ఎలాంటి ప్రభావం చూపించబోదు" అని ఆశా శర్మ ఉద్యోగులకు ఇచ్చిన సందేశంలో వెల్లడించారు. తాజా నిర్ణయంతో ఎక్స్‌బాక్స్‌లో వచ్చే ఏడాది నాటికి ఉద్యోగుల సంఖ్య 20శాతం మేర తగ్గనుంది. ఇదిలా ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో 4800 మందిని తొలగిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎక్స్‌బాక్స్ లేఆఫ్‌లు ఇందులో భాగమేనని సదరు విభాగ ప్రతినిధులు వెల్లడించారు. కేవలం వ్యయ నియంత్రణ చర్యగా కాకుండా.. మైక్రోసాఫ్ట్ పనిచేసే విధానంలో ఒక విస్తృత మార్పులో భాగంగానే ఈ ఉద్యోగ తొలగింపులను చేపడుతున్నట్లు ఆ సంస్థ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మన్ తెలిపారు.



# అర్జెంటీనా జోరు..

## ఈజిప్టును ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు

**అట్లాంటా:** ఫిఫా వరల్డ్ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. 3-2 గోల్స్ తేడాతో ఈజిప్టును ఓడించింది. ఈజిప్టు ఆటగాళ్లు యాసర్ ఇబ్రహీం, మోస్తఫా జికో గోల్స్ చేయడంతో తొలుత అర్జెంటీనా 2-0తో వెనుకబడింది. అయితే.. క్రిస్టియన్ రొమెరో, మెస్సిలు నాలుగు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేయడంతో ఆట సమమైంది. ఈ క్రమంలోనే స్టాపేజ్ టైమ్‌లో అర్జెంటీనా ప్లేయర్ ఎంజో ఫెర్నాండెజ్ గోల్ చేసి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు.

## ఫిఫా ప్రపంచ కప్ 2026లో

# ముగిసిన పోర్చుగల్ కథ

## ప్రీ క్వార్టర్స్‌లో 1-0తో పోర్చుగల్ పై స్పెయిన్ గెలుపు

అమెరికా వేదికగా జరుగుతున్న ఫిఫా ప్రపంచ కప్ 2026లో పోర్చుగల్ కథ ముగిసింది. ఫుట్‌బాల్ దిగ్గజంగా పేరు పొందిన క్రిస్టియానో రొనాల్డో తన చివరి ప్రపంచ కప్ మ్యాచ్‌ను ఓటమితో ముగించాడు. స్పెయిన్‌తో జరిగిన ప్రీ క్వార్టర్ మ్యాచులో పోర్చుగల్.. 1-0 తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో స్పెయిన్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. పోర్చుగల్ మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక 2 దశాబ్దాలకు పైగా తన ఆటతో మంత్రముగ్ధులను చేసిన రొనాల్డో.. తన చివరి మ్యాచ్ ముగిసిన తర్వాత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టాడు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో.. 2006లో తొలిసారి ఫిఫా వరల్డ్ కప్ ఆడాడు. ఇక ఫిఫా ప్రపంచకప్ 2026 తనకు చివరి టోర్నీ అని రొనాల్డో ఇది వరకే ప్రకటించాడు. కానీ తన జట్టును మరోసారి క్వార్టర్ ఫైనల్‌కు తీసుకెళ్లాలన్న అతడి ఆశలు నెరవేరలేదు. స్పెయి-న్ మికెల్ మెరినో చేసిన ఏకైక గోల్ .. స్పెయిన్ విజయాన్ని, పోర్చుగల్ నిష్క్రమణను ఖాయం చేసింది. కాగా స్పెయిన్.. 2010లో ఫిఫా ప్రపంచకప్ టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత ఒక్కసారి కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోలేదు. కానీ 16 ఏళ్ల తర్వాత మళ్లీ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. స్పెయిన్ క్వార్టర్ ఫైనల్‌లో బెల్జియంతో తలపడే అవకాశం ఉంది. మరోవైపు ఈ మ్యాచ్‌తో స్పెయిన్ వరుసగా ఆరు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులకు గోల్ చేసే అవకాశమే ఇవ్వకుండా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇటలీ (1990), స్విట్జర్లాండ్ (2006-10) పేరిట ఉన్న ఐదు వరుస క్లీన్ షీట్‌ల రికార్డును ఆ జట్టు అధిగమించింది. గోల్ కీపర్ ఉనై సిమోన్ వ్యక్తిగతంగానూ అరుదైన ఘనత సాధించాడు. వరుసగా 609 నిమిషాల పాటు గోల్ ఇవ్వకుండా నిలిచి ప్రపంచ కప్ చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో ఇటలీ దిగ్గజ గోల్ కీపర్ వాల్టర్ జెంగా పేరిట ఉన్న 517 నిమిషాల రికార్డును అతడు బ్రేక్ చేశాడు. ఇక 41 ఏళ్ల రొనాల్డో.. అరుదైన రికార్డు సాధించాడు. ఆరు ప్రపంచ కప్‌లు ఆడిన ఇతడు.. అన్నింట్లోనూ గోల్ చేసిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. తాజా టోర్నీలో అతడు మూడు గోల్స్ చేశాడు. ఆరు సార్లు ప్రపంచకప్ ఆడినా.. రొనాల్డో మాత్రం ట్రోఫీ అందుకోలేకపోయాడు. తన డెబ్యూ ప్రపంచకప్ అయిన 2006లో రొనాల్డో జట్టు సెమీస్ వరకూ చేరింది. ఇదే అతడి కెరీర్‌లో బెస్ట్. మొత్తంగా ప్రపంచకప్‌లో అతడు 27 మ్యాచులలో 11 గోల్స్ చేశాడు.

జనం వార్త




## హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి - బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.

## డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్.. ఎన్టీఆర్



ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.

# టిక్కెట్ ధరలు.. పాప్‌కార్న్ రేట్లు

### నాగవంశీ కామెంట్స్‌పై చర్చ



టాలీవుడ్ నిర్మాత నాగవంశీ లెనిన్ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా చేసిన టికెట్ ధరల వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. ప్రేక్షకులు థియేటర్లకు రాకపోవడానికి అధిక టికెట్ ధరలు కారణమా, లేక లోపల అమ్మే పాప్‌కార్న్, వాటర్ బాటిల్స్ వంటి తినుబండారాల రేట్లు కారణమా అనేదానిపై సర్వే చేయాలంటూ ఆయన పేర్కొన్నారు. జనాలు టికెట్ ధరల గురించి పట్టించుకోట్లేదని థియేటర్ లోపల ఉన్న పాప్‌కార్న్ ధరల వలనే ప్రేక్షకులు సినిమాలకు రాలేకపోతున్నారని కామెంట్లు చేశాడు. అయితే ఈ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందన రావడమే కాకుండా ఈ విషయంలో నాగవంశీ విమర్శించడం మొదలుపెట్టారు. పెద్ద సినిమాలు విడుదలైనప్పుడు ప్రభుత్వాల నుంచి ప్రత్యేక అనుమతులు తెచ్చుకుని మరీ టికెట్ రేట్లు పెంచడం వల్ల, ఒక మధ్యతరగతి కుటుంబం థియేటర్‌కు వెళ్లి సినిమా చూడటం అనేది భారంగా మారిందని ప్రేక్షకులు వాపోతున్నారు. థియేటర్‌లో ఫుడ్ కొనాలా వద్దా అనేది తమ ఇష్టమని, కానీ సినిమా చూడాలంటే టికెట్ తప్పనిసరి కాబట్టి ముందుగా టికెట్ ధరలను అదుపులోకి తేవాలని చాలా మంది డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో మల్టీప్లెక్సుల్లో లభించే పాప్‌కార్న్, కూల్‌డ్రింక్స్ ధరలు బయట కంటే కొన్ని రెట్లు ఎక్కువగా ఉండటం కూడా థియేటర్ అనుభవాన్ని మరింత ఖరీదైనదిగా మారుస్తోంది. ఈ మితిమీరిన ఖర్చుల వల్లే ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ల వైపు వెళ్లకుండా, కొన్ని వారాలు ఓపిక పట్టి ఓటీటీల్లోనే సినిమాలను చూసేందుకు మొగ్గు చూపుతున్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు టికెట్ల ద్వారా వచ్చే లాభాల్లో సింహభాగం నిర్మాతలు, పంపిణీదారులకే వెళ్తుందని, కేవలం థియేటర్ నిర్వహణ, సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లుల కోసమే తాము ఫుడ్ అండ్ బెవరేజెస్ అమ్మకాలపై ఆధారపడాల్సి వస్తోందని వారు సమర్థించుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ, ప్రేక్షకులను మళ్లీ థియేటర్ల వైపు రప్పించాలంటే కేవలం టికెట్ ధరలు లేదా కేవలం ఫుడ్ రేట్లు మాత్రమే కాకుండా, సినిమా చూసే మొత్తం వ్యయాన్ని తగ్గించి సామాన్యుడికి అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత చిత్ర పరిశ్రమ, థియేటర్ యాజమాన్యాల పై ఎంతైనా ఉందని నెటిజన్లు చెప్పుకొచ్చారు.

# ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నా

### నటి కృతి సనన్ బోల్డ్ స్టేట్‌మెంట్



గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి - పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ పక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది. ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.

# అనిల్ రావిపూడి మల్టీస్టారర్

### షూటింగ్‌లో చేరిన వెంకటేశ్






టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మల్టీస్టారర్ చిత్రాల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా ఒకటి. విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కల్యాణ్ రామ్‌పై ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించిన చిత్రబృందం, ఇప్పుడు తదుపరి కీలక షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో విక్టరీ వెంకటేష్ కూడా సెట్స్‌లోకి అడుగుపెట్టడంతో షూటింగ్ మరింత జోరందుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్ రామ్‌తో పాటు హీరోయిన్లు కీర్తి సురేష్, కృతి శెట్టి పాల్గొంటున్నారు. ముఖ్యంగా వెంకటేష్,కల్యాణ్ రామ్‌ల మధ్య వచ్చే కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇద్దరి పాత్రల మధ్య ఉండే కెమిస్ట్రీ, వినోదభరితమైన సంభాషణలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కుటుంబ కథా చిత్రాలకు వినోదాన్ని జోడించడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన అనిల్ రావిపూడి, ఈ సినిమాలో కూడా తన మార్క్ కామెడీ, భావోద్వేగాలతో ప్రేక్షకులను అలరించేలా కథను రూపొందించినట్లు తెలుస్తోంది. వెంకటేష్ కామెడీ టైమింగ్, కల్యాణ్ రామ్ మాస్ ఇమేజ్‌ను బ్యాలెన్స్ చేస్తూ పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించనున్నారు. ఈ నాలుగు ప్రధాన పాత్రల చుట్టూనే కథ సాగనున్నట్లు తెలుస్తోంది. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి. ఈ సినిమాకు సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను సమీర్ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కల్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించగా, తాజా షూటింగ్ అప్‌డేట్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

## సత్లుజ్ మూవీని చూడాలి..చూపించాలి

### ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇది నిజంగా అత్యంత ధైర్యవంతమైన ఫిల్మ్ మేకింగ్. ఈ సినిమా చాలా మందిని కలవరపెడుతుంది.. అవగాహన కల్పిస్తుంది.. ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. సత్యం, నిజాయతీని సినిమా మాధ్యమం ద్వారా చెప్పినప్పుడు అది 'సత్లుజ్' అవుతుంది. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. కానీ, సినిమాలో బాధితులను చేసినట్లు ఎన్‌కౌంటర్ చేయకూడదు. అధికారంలో ఉన్న వారందరికీ నా విన్నపం ఏంటంటే.. 'సత్లుజ్'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

## చిత్రసీమలో ప్రతిభ ఉంటేనే రాణిస్తారు: రవిశంకర్



టాలీవుడ్‌లో నెపోటిజం అంశంపై ఎప్పుడూ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' అధినేతల్లో ఒకరైన వై. రవిశంకర్ ఈ విషయంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఇటీవల జరిగిన 'రాజా ది రాజా' చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర హీరో రిత్విక్‌ను ఉద్దేశించి వేదికపై రవిశంకర్ మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమలో రాణించాలంటే బ్యాక్‌గ్రౌండ్ కంటే సొంత ప్రతిభే ముఖ్యమని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలోకి ఎవరైనా గోల్డెన్ స్పూన్ లేదా డైమండ్ స్పూన్‌తో పుట్టి రావచ్చు కానీ ఇక్కడ అవేమీ పని చేయవని, మిమ్మల్ని నిలబెట్టేది కేవలం మీలో ఉన్న ప్రతిభ మాత్రమేనని ఆయన నొక్కి చెప్పారు. మన వెనుక ఎవరి అండా లేదని భావించి కష్టపడి ముందుకు సాగినప్పుడే నిజమైన విజయం దక్కుతుందంటూ హీరో రిత్విక్‌ను ప్రోత్సహిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రవిశంకర్ చేసిన ఈ కామెంట్స్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నరేష్, వైశాఖ ధీమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అందిస్తున్నారు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com